


రోజూ తొమ్మిది గంటలకు నిద్రపోయే అనసూయమ్మగారికి ఆ రోజు ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు. తన ప్రక్కనే హాయిగా నిద్రపోతున్న తన పదహారేళ్ళ కూతురు రాధిక ముఖంలోకి చూస్తూ రాధిక భవిష్యత్తు గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. అయినా ఆవిడ ఆలోచనలు ఒక కొలిక్కి రావడం లేదు.

రాధిక ఆరవ ఏటనే రాధిక తండ్రి రామారావు కారు ప్రమాదంలో మరణించాడు. అప్పట్నుంచి రాధికను పెంచి పోషించ వలసిన బాధ్యత అనసూయమ్మగారి మీద పడింది. అనసూయమ్మగారు ప్రభుత్వం వారిచ్చిన ఋణంతో కుట్టుమిషను కొనుక్కుని దాని మీద వస్తున్న ఆదాయంతో కాలం వెళ్ళబుచ్చుతూ రాధికకు పదవ తరగతి వరకూ చదువు చెప్పించ గలిగారు. రాధిక ఇప్పుడు పదవ తరగతి ఫస్టు క్లాస్‌లో పాసయింది. కాలేజీలో చేరి ఇంటర్మీడియెట్ కూడా చదువుతానంటోంది. రాధికను కాలేజీలో చేర్పించాలా? వద్దా? అనేదే ఆవిడకొచ్చిన పెద్ద సమస్య. అదే విషయం పొరుగింటి శాంతమ్మగారి తోనూ, ఇరుగింటి కాంతమ్మగారితోనూ, ఎదురింటి విమలమ్మగారితోనూ సంప్రతించారు.

"చూడండి అనసూయమ్మగారూ! మన మధ్య తరగతి ఆడపిల్లలకు పెద్ద చదువులెందుకు? ఉద్యోగాలు చేయాలా! ... ఊళ్ళేలాలా!... ఏదో పదవ తరగతి పాసయింది కదా ఇక ఇంటి పనీ వంట పనీ నేర్పించండి చాలు" అన్నారు పొరుగింటి శాంతమ్మగారు.

"మీ అమ్మాయికి తెలివితేటలున్నాయని ఇప్పుడు ఇంటర్మీడియెట్ చదువుతానంటుంది. తరువాత బియ్యే చదువుతానంటుంది. అప్పుడు మీరు ఏ ఏమ్మే వాణ్ణో చూసి పెళ్ళిచేయాలి. తెలివి తేటలున్నాయని పెద్ద చదువులు చెప్పిస్తూ పోతుంటే ఇటు మన ఆర్థిక స్తోమత గురించి కూడా కొంచెం ఆలోచించాలి కదా. మా అమ్మాయికి మీ రాధిక కంటే ఎక్కువ మార్కులొచ్చాయి. అయినా నేను కాలేజీలో చేర్పించ దలుచుకోలేదు" అన్నారు ఇరుగింటి కాంతమ్మగారు.

"వదినగారూ ఇప్పుడు కాలేజీ చదువుల సంగతి మీకు బొత్తిగా తెలియనట్టుంది. ఆ శేఖరం మేస్టారమ్మాయిని చూశారా. ఎంత మంచి పిల్ల. తెలివి తేటలు న్నాయని కాలేజీలో చేర్పిస్తే కాలేజీలో చేరిన ఆర్నెల్లకే ఎర్రగా బుర్రగా వున్నాడని ఎవర్నో ప్రేమించిందట. ఇప్పుడు వాణ్నే పెళ్ళి చేసుకుంటానంటోందట. వాడు మన కులం వాడు కాదని ఎంత చెప్పినా వినడం లేదట. ఎందుకొచ్చిన గొడవ మీ అమ్మాయికి టైలరింగ్ నేర్పించండి. బ్రతుకు తెరువు చూసుకున్నట్లూవుంటుంది, మీకు కొంత సహాయం చేసినట్లూ అవుతుంది" అంటూ ఉచిత సలహా ఇచ్చారు ఎదురింటి విమలమ్మగారు.

అలా వాళ్ళు చెప్పిన అభిప్రాయాలు అనసూయ మ్మగారికి ఎందువల్లనో నచ్చలేదు. ఏది ఏమైనా రాధికను కాలేజీలో చేర్పించటానికే నిశ్చయించుకున్నారు అనసూయమ్మగారు.

రాధికను కాలేజీలో చేర్పించి నప్పట్నుంచీ ఆమెతో కలుపుగోలుగా వుండేవాళ్ళందరూ ఇప్పుడామెతో చాలా ముభావంగా వుంటున్నారు. రాధికను కాలేజీలో చేర్పించడమే ఆమె చేసిన పెద్ద తప్పు. ఒక ఆడపిల్ల ఒంటరిగా కాలేజీకి వెళ్ళడం వాళ్ళ దృష్టిలో పెద్ద నేరం!

కాలగర్భంలో మరో ఏడు సంవత్సరాలు కరిగి పోయాయి. ఆ ఊళ్ళో వున్న ఒక్క నర్సింగ్ హోంకి వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకి విపరీతంగా పెరిగిపోతోంది. ఎందుకంటే అక్కడకొచ్చిన కొత్త లేడీ డాక్టర్‌ది గుండెజబ్బుల్ని బాగు చేయడంలో అందెవేసిన చెయ్యిట. గుండె నొప్పితో తీవ్రంగా బాధ పడుతున్న విమలమ్మగారు అక్కడే ట్రీట్‌మెంట్ తీసుకుంటు న్నారు. లేడీ డాక్టర్ అనసూయమ్మగారి కూతురు రాధిక కావడం వల్ల విమలమ్మగారికి మందులు కూడా ఉచితంగానే దొరుకుతున్నాయి.

— వై.వి.జి. సత్యనారాయణ


